


ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
జిల్లావ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్ రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏలూరు జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. 51 కేంద్రాల్లో జరిగిన ప్రథమ సంవత్సరం కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు మొత్తం 16,049 మందికిగాను 15,026 మంది హాజరయ్యారు. 1,023 మంది గైర్హాజరయ్యారు. వీరిలో సాధారణ విద్యార్థులు 14,007 మందికి 13,452 మంది హాజరవ్వగా 555 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో 2,042 మందికి 1,574 మంది హాజరవ్వగా 468 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 94 శాతం హాజరు నమోదైంది. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రభాకర్‌రావు తెలిపారు.


ఏలూరులో నినదిస్తున్న నేతలు


ఆగిరిపల్లిలో..

మోడీ పాలనలో రైతులకు నష్టమే

ధర్నాల్లో రైతు, కార్మిక సంఘాల నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
కేంద్ర మోడీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు ఏలూరు కలెక్టరేట్ ముందు రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. రైతుల చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా రైతాంగానికి లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలు అమలు చేయని కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై నిరసన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని, కార్మికులను మోసగించిన బిజెపి, దాని మిత్రులను ఓడించాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.కె.భాషా, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడారు. 2021 ఢిల్లీ రైతాంగ ఉద్యమ సందర్భంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీలను ఏఒక్కటీ అమలు చేయకుండా మోసగించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడికి అదనంగా 50 శాతం కలిపి అన్ని పంటలకు మద్దతు ధర నిర్ణయించి ఆ ధర అమలయ్యేలా చట్టబద్ధత కల్పించినప్పుడే దేశంలో రైతులకు మనుగడ ఉంటుందని చెప్పారు. రైతులకు క్షమాపణ చెప్పి మూడు వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేసిన సందర్భంలో ప్రధాని మోడీ మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. చట్టం చేస్తే కేంద్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందంటూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం తీసుకువచ్చి దేశవ్యాప్తంగా ఒక దఫా రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. కేంద్ర విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలన్నారు. రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి, దాని మిత్రులను రానున్న ఎన్నికల్లో ఓడించి వ్యవసాయరంగాన్ని, రైతాంగాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు మన్నవ కృష్ణచైతన్య, పి.కిషోర్, కె.కృష్ణమాచార్యులు, వి.సాయిబాబా, బి.జగన్నాథం, కె.విజయలక్ష్మి, కాకి నాని, ఎర్ర శ్రీనివాసరావు, ఎ.అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాసరావు, కడుపు కన్నయ్య, జె.గోపీ, వి.శ్రీరామచంద్రమూర్తి, జక్కుల రామారావు, పి.ఆదిశేషు, వి.శ్యామల, ఎం.యామిని పాల్గొన్నారు.



ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో..

చింతలపూడి: మోడీ రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, ఎఐకెకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి రంగనాథ్ అన్నారు. చింతలపూడి బోసు సెంటర్లో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎస్‌కె.కాలేషా, తొర్లపాటి బాబు, పాండురంగారావు, ఎస్‌కె.జానీ, తక్కెలపాటి ప్రసాద్‌రావు, తాడిగడప మాణిక్యాలరావు, రావెళ్ల వెంకటేశ్వరరావు, ముల్లగిరి లాజర్, వలీ కిరణ్, విజయ్ కృష్ణ, వాసు, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు పి.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు, ఎఐటియుసి నాయకులు జమ్మి శ్రీను మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు వి.సద్గురు, కె.సీతారాములు, ఎస్.శివకుమార్, తాడిగడప ఆంజనేయరాజు, ఎం.రెడ్డి, మట్టా రామకృష్ణ పాల్గొన్నారు.

ముసునూరు: మోడీ ప్రధానిగా ఉన్నంతకాలం రైతులకు నష్టమే తప్ప, లాభం చేకూర్చే విధానాలు చేపట్టే పరిస్థితి లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. గురువారం మండల కేంద్రమైన ముసునూరు మండపం సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కంచర్ల దుర్గారావు, కంచర్ల వంశీ, కంచర్ల శివప్రసాద్, కంచర్ల శ్రీను, తలకొండ సీతారాములు, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

నిడమర్రు: నిడమర్రు సెంటర్లో ఆందోళన చేపట్టారు. రైతుసంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు నారపల్లి రమణరావు మాట్లాడారు. కార్యక్రమంలో వెలగలేటి మోహన్, కానూరు రాజు, లావిటి సోంబాబు, చంద్రరావు, బాబు, రాజు, గవర సత్యనారాయణ, నౌడు శ్రీనివాసు, వేల్పూరు ఆంజనేయులు, కె.నాని పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో సిఐటియు, పలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జహీంగీర్‌భాషా, నరేష్, రవీంద్ర, కోటయ్య, రాంబాబు, ప్రసాద్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: ఎ.నాగులపల్లిలో రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఎం.నాగులపల్లి పాల కేంద్రం వద్ద జరిగిన ఆందోళనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, రైతు సంఘం మండల కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు గోగులమండ ప్రసాదరావు, రాంబాబు, పోలుకొండ నాగరాజు, తూంపాటి పూర్ణచంద్రరావు, ఎ.వీర్రాజు పాల్గొన్నారు.


ఉంగుటూరు: సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఎపి కౌలురైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో కైకరం సెంటర్‌లో మోడీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తా వెంకటేశ్వరరావు, అల్లు గోవిందు, ఎం.గోవింద్, వి.శ్రీరాములు, డి.శ్రీను, పి.బాబూరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు జి.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్.హనుమాన్లు, ఎకెడి.ప్రసాద్, ఇ.దుర్గారావు, మరియదాసు, వసంతరావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా బుట్టాయగూడెం సెంటర్లో నిరసన చేపట్టారు. పివైఎల్ నేత తగరం బాబురావు, ఎఐకెఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మల సురేష్, నేత కారం రాఘవ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు వెట్టి భారతి, బి.వినోద్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, భాష, రంపాల రాజు, కాకాడ కన్నారావు, కబ్బడి సోమరాజు, పాయం మూకరాజు, మామిడి మురళి, సరియం సిరమరాజు, గోగుల పండు, నడిపి రాజు, కొమరం నాగర్జున పాల్గొన్నారు.

దెందులూరు టిక్కెట్ చింతమనేనికే

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
టిడిపి దెందులూరు నియోజకవర్గ అభ్యర్థిగా చింతమనేని ప్రభాకర్ పేరు ఖరారైంది. ఈ మేరకు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు బుధవారం చింతమనేనికి ఫోన్ చేసి ఖరారు చేయడంతోపాటు గురువారం ప్రకటించిన రెండో జాబితాలో ఆయన పేరు ఉండటంతో సస్పెన్స్‌కు తెరపడింది. దీంతో నియోజకవర్గంలోని టిడిపి శ్రేణులు, ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మొదటి నుంచి చింతమనేనికి టిడిపి టిక్కెట్ దక్కుతుందో, లేదో అనే అనుమానాలు వెల్లువెత్తాయి. చింతమనేనికి బదులు ఆయన కుమార్తెకు, భార్యకు టిక్కెట్ ఇస్తారనే ప్రచారం సాగింది. అయితే టికెట్ తనకే ఇస్తారని, తన కుటుంబ సభ్యులకు పోటీ చేసే ఆసక్తి లేదని స్వయంగా చింతమనేని ప్రకటించాల్సి వచ్చింది. ఈడ్పుగంటి సహా పలువురు అధినేత చంద్రబాబును కలిసి తమకు సీటు కేటాయించాలని కోరారు. సినీ నటుడు మురళీమోహన్ కుమార్తెకు, మాజీ ఎంపీ మాగంటి బాబుకు టిక్కెట్ ఇస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. దీంతో చింతమనేని అభ్యర్థిత్వంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. అయితే చంద్రబాబు ప్రకటనతో అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి.


చింతమనేని ప్రభాకర్



మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు

ద్వారకాతిరుమల: టిడిపి గోపాలపురం నియోజకవర్గ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రాజు పేరు ఖరారైంది. దీంతో ఆ నియోజకవర్గంలో భాగమైన నిర్ణయాన్ని ద్వారకాతిరుమల మండలంలోని టిడిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. టిడిపి మండలాధ్యక్షులు లంక సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో అహర్నిశలు తిరుగుతున్న మద్దిపాటికి టిక్కెట్ ఇవ్వడం శుభ పరిణామమన్నారు.

ఉత్కంఠకు తెర..!

- పిఠాపురం బరిలోనే పవన్‌కళ్యాణ్
- ఎట్టకేలకు స్పష్టతిచ్చిన జనసేనాని
- ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాల్లో జనసేన అభ్యర్థులు ఖరారు
- 'పోలవరం'పై వీడని ఉత్కంఠ: టిడిపికే సీటు అని ప్రచారం



ప్రజాశక్తి - భీమవరం
జనసేన అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఎక్కడ నుంచి పోటీ చేస్తారనే అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. వచ్చే ఎన్నికల్లో పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో ఇప్పటి వరకూ సాగిన ఊహాగానాలకు ఫుల్‌స్టాప్ పడింది. 2019 ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కళ్యాణ్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో పోయిన చోటే వెతుక్కోవాలనే నానుడికి అనుగుణంగా ఈసారి ఎన్నికల్లో భీమవరం నుంచే పోటీ చేయాలని పవన్ నిర్ణయం తీసుకున్నట్లు మొదట్లో ప్రచారం సాగింది. దీనిలో భాగంగానే ఇటీవల భీమవరంలో పర్యటించిన పవన్ టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. దీంతో పవన్ భీమవరం నుంచే పోటీ చేస్తారని అంతా భావించారు. రాష్ట్రవ్యాప్తంగా భీమవరం నుంచే పవన్ పోటీ చేస్తున్నట్లు ప్రచారం కూడా సాగింది. అయితే మారిన సమీకరణల నేపథ్యంలో మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు జనసేనలో చేరారు. ఒకరోజు వ్యవధిలోనే రామాంజనేయులుకు జనసేన టిక్కెట్‌ను పవన్ కేటాయించి ప్రకటించారు. దీంతో భీమవరం నుంచి పవన్ పోటీ చేయట్లేదని స్పష్టమైంది. ఇక తిరుపతి, పిఠాపురం, గాజువాక స్థానాల్లో ఏదోక చోట నుంచి పోటీ చేస్తారనే ప్రచారం సాగింది. మరోపక్క ఎంపీగా సైతం పోటీ చేస్తారని విస్తృత ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో ఈ ప్రచారాలన్నింటికీ పవన్ ఫుల్‌స్టాప్ పెట్టారు. మంగళగిరిలో జరిగిన జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో తాను కాకినాడ జిల్లా పిఠాపురం నుంచి పోటీ చేస్తున్నట్లు పవన్ ప్రకటించారు. పిఠాపురం నియోజకవర్గంలో కాపు సామాజిక తరగతి ఓట్లు దాదాపు 91 వేలు ఉండడంతో పవన్ భారీ విజయానికి ఢోకా ఉండదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు స్థానాల నుంచి జనసేన పోటీ చేస్తున్నట్లు స్పష్టత వచ్చింది. ఆయా స్థానాల అభ్యర్థులను పవన్ ఖరారు చేయడమే దీనికి నిదర్శనం. అయితే పోలవరం సీటు విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. బిజెపితో పొత్తు నేపథ్యంలో జనసేన మూడు అసెంబ్లీ సీట్లు వదులుకోవాల్సి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలవరం సీటును జనసేన టిడిపికే వదిలేస్తుందనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా జనసేనకు బలమైన అభ్యర్థి లేకపోవడం, టిడిపి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడం, పొత్తు పరిణామాల నేపథ్యంలో జనసేనాని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై అటు టిడిపి, లేదా ఇటు జనసేన నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. పోలవరం సీటు టిడిపికి వదిలేస్తే జనసేన నాలుగు సీట్లకే పరిమితమైనట్లు. కైకలూరు సీటు బిజెపికి కేటాయించినట్లు తెలుస్తోంది. మొత్తంగా పరిశీలిస్తే తాజాగా ప్రకటించిన దెందులూరు అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌తో కలిపి టిడిపి ఎనిమిది మంది అభ్యర్థులను ప్రకటించగా, జనసేన నలుగురు అభ్యర్థులను ఖరారు చేసింది. కైకలూరు, పోలవరం సీట్ల నుంచి ఎవరు బరిలోకి దిగుతారనేది తెలియాల్సి ఉంది.

రూ.18.99 కోట్లు ఇబిసి నేస్తం సొమ్ము జమ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు
వైఎస్ఆర్ ఇబిసి నేస్తం కింద మూడో విడతలో జిల్లాలో 12,660 మంది అగ్రవర్ణ పేద మహిళల లబ్ధిదారుల ఖాతాల్లోకి రూ.18.99 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. వైఎస్ఆర్ మూడో విడత ఇబిసి నేస్తం కింద రాష్ట్రవ్యాప్తంగా రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతోపాటు ఇతర ఒసి సామాజిక తరగతులకు చెందిన అర్హులైన పేద మహిళల ఖాతాల్లోకి ఆర్థిక సహాయాన్ని జమచేసే బృహత్తర కార్యక్రమాన్ని గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లి నుంచి సిఎం జగన్ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, బిసి కార్పొరేషన్ ఇడి పుష్పలత, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్.నాగరాణి, మైనారిటీ సంక్షేమాధికారి శ్రీనివాసరావు, పలువురు లబ్ధిదారులు తిలకించారు. అనంతరం జిల్లాలోని సంబంధిత లబ్ధిదారులకు చెందిన నమూనా మెగా చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు విడతల్లో రూ.15 వేల వంతున వెరసి రూ.45 వేలు ఆర్థిక సహాయం అందించడంలో భాగంగా వైఎస్ఆర్ ఇబిసి నేస్తం పథకం అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 12,660 మంది రూ.18.99 కోట్లు లబ్ధి పొందారన్నారు.


నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఎన్నికల ఖర్చు లెక్కింపునకు రేటు ఛార్ట్ : డిఆర్ఒ

ప్రజాశక్తి - ఏలూరు
రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పర్యవేక్షణకు రేటు ఛార్ట్ కచ్చితంగా అమలు చేస్తామని జిల్లా రెవెన్యూ అధికారి డి.పుష్పమణి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ డి.పుష్పమణి సంబంధిత అధికారులతో సమావేశమై ఎన్నికల ఖర్చు లెక్కింపునకు రేట్ ఛార్ట్ నిర్ణయంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల వ్యయ పర్యవేక్షణ విభాగం రేట్‌ఛార్ట్ ప్రకారం ఛార్జి చేస్తుందన్నారు. దాని ప్రకారం ఖర్చు వారి ఖాతాల్లో వేస్తుందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరాలకు వినియోగించే వాహనాలు, షామియానాలు, మైక్‌సెట్, ఆహారం, మీడియా ప్రకటనలు, తదితరాలన్నింటిని ఛార్ట్‌లో రేట్ల ప్రకారం అభ్యర్థుల ఖాతాలో నమోదు చేస్తారన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు, పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఏసుబాబు పాల్గొన్నారు.


నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ప్రజాశక్తి - ఏలూరు
జిల్లాలోని ఉద్యోగుల నుండి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ శుక్రవారం ఉదయం 10.30 గంటల నుండి కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన గ్రీవెన్స్‌లు ఏమైనా ఉంటే అర్జీదారు తమ సిఎఫ్ఎంఎస్ ఐడి, ఎంప్లాయి గుర్తింపు నెంబరు, ఆధార్ కార్డు నెంబర్లతో ఎంప్లాయి గ్రీవెన్స్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ బాలరాజు


ప్రజాశక్తి - జీలుగుమిల్లి
మహిళా సంక్షేమానికి వైసిపి పెద్దపీట వేస్తుందని పోలవరం నియోజకవర్గ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. గురువారం జీలుగుమిల్లి సొసైటీ అవరణలో జరిగిన 4వ విడత వైఎస్ఆర్ చేయూత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు ప్రతి ఏటా అందిస్తున్న వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత కింద రూ.3 కోట్ల 55 లక్షల చెక్‌ను లబ్ధిదారులకు అందించారు. అనంతరం జీలుగుమిల్లి పార్టీ కార్యాలయంలో మండల బూత్ కమిటీల సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్.రామోజీరావు, ఏరియా కో ఆర్డినేటర్ సుబ్బారావు, జెడ్‌పిటిసి వసంతరావు, సర్పంచులు చిర్రి జగదాంబ, కుంజా పార్వతి, సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపిపి-2 ఉప్పల లత కుమారి, పార్టీ అధ్యక్షులు సందా ప్రసాద్, వనమా రామకృష్ణ పాల్గొన్నారు.


జీలుగుమిల్లి: చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ

కుక్కునూరు: ప్రతి సచివాలయం పరిధిలో రూ.82 లక్షల వ్యయంతో నూతన సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ సెంటర్లను ముఖ్యమంత్రి జగన్ ఆదేశాలతో నిర్మించామని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, నియోజవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలో గురువారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం, వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా కుక్కునూరు సచివాలయం-2 పరిధి నల్లకుంట గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, దాచారం సచివాలయం పరిధిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, మారేడుబాక సచివాలయం పరిధి కివ్వాక ఆర్ అండ్ ఆర్ కాలనీలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, మాధవరం సచివాలయం పరిధిలో సచివాలయం, రైతు భరోస కేంద్రం, విలేజ్ క్లినిక్, కుక్కునూరు సచివాలయం పరిధిలో సచివాలయం, రైతు భరోస, హెల్త్ బజార్ కేంద్రాలను నూతనంగా ప్రారంభించారు. మండలంలో వైఎస్ఆర్ ఆసరా 2,523 మంది అక్క చెల్లమ్మలకు రూ.18,750 చొప్పున ఈ సంవత్సరం అందిస్తున్న మొత్తం లబ్ధి రూ.4,73,06,250 కోట్లు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుక్కునూరు సర్పంచి రావు మీనా వినోద్, ఎంపిపి చేబ్రోలు గీతావాణి, కుక్కునూరు తహశీల్దార్ అచ్చుత కుమారి, ఎంపిడిఒ నరసింహారావు పాల్గొన్నారు.

'కొత్తూరు గిరిజన నిర్వాసితులకు ఇళ్లు ఇవ్వాలి'

ప్రజాశక్తి - కుక్కునూరు
మర్రిపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లను నిర్వాసితులకు ఇవ్వాలని సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మర్రిపాడు సచివాలయం ప్రారంభానికి వచ్చిన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తెల్లం రాజ్యలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసి నిరాశ్రయులవుతున్న నిర్వాసితులు అభివృద్ధి లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి వసతి కల్పించి ఆదుకోవాలని కోరారు. అనంతరం రాజ్యలక్ష్మి పోలవరం అడ్మినిస్ట్రేషన్ అధికారి ఇలాఖ్యతో ఫోన్లో మాట్లాడి కొత్తూరు నిర్వాసితులకు వెంటనే వారికి కేటాయింపు చేసిన గృహాలను ఇచ్చి, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు మిడియం తిరపతమ్మ, సోడే సత్యవతి, కొండ్రు నరసింహారావు, సరియం హరినాద్, మౌనిక, రాము, ఊకె ముత్తయ్య పాల్గొన్నారు.


వినతిని అందిస్తున్న నిర్వాసితులు

మురుగు సమస్య పరిష్కరించాలంటూ నిరసన దీక్ష

ముదినేపల్లి: వైఎస్ఆర్ కాలనీలోని మురుగు సమస్యను పరిష్కరించి, మా ప్రాణాలు కాపాడాలని మండలంలోని పేయ్యేరు పంచాయతీ శివారు వైఎస్ఆర్ కాలనీవాసులు చేపట్టిన రిలే నిరసన దీక్ష గురువారంతో రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఎంతో కాలంగా మురుగు సమస్యతో తీవ్ర అవస్థలు పడుతున్నామన్నారు. మురుగు సమస్య పరిష్కరించాలంటూ అనేక పర్యాయాలు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకున్న వారు లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు రోడ్లపై ప్రయాణించడంతో రోడ్లు పాడుకావడంతో పాటు, ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. నెలల కొద్ది ఇళ్ల మధ్య మురుగునీరు నిల్వ కారణంగా దోమల విపరీతంగా వృద్ధి చెంది ప్రజలపై దాడి చేస్తున్నట్లు తెలిపారు. దీంతో కాలనీ వాసులు రోగాలు బారిన పడుతూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. సంబంధిత శాఖల అధికారులు, గ్రామపంచాయతీ, పాలకవర్గం వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాల్సిందిగా వారు వేడుకుంటున్నారు. ఈ నిరసన దీక్షలో మొవ్వ పనేంద్ర సత్యవోలు నాగలక్ష్మితో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్
ప్రతి విద్యార్థి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించినట్లయితే అంటు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. పెదపాడు మండలంలోని పెదపాడు గ్రామంలో శ్రీకృష్ణా గురుకులమ్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యవిద్య బోధిస్తూ అపరిశుభ్ర పరిసరాల వల్ల దోమలు వృద్ధి చెంది వాటి ద్వారా ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, డెంగీ, చికెన్ గునియా సంభవించే అవకాశం ఉందన్నారు. మనకి ఎక్కువగా హాని చేసే దోమలు మన గృహాల్లో ఉండే మంచినీటి నిల్వ ప్రాంతాలైన నీళ్ల తొట్టెలు, నీళ్ల డ్రమ్ములు, మూత లేని నూతులు, వాడేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు, రుబ్బురోలు, ఫ్లవర్ వాసులు, పూల కుండీలు, ఎయిర్ కూలర్స్, ఫ్రిడ్జ్ వెనుక బాక్సు, పల్లపునీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయ న్నారు. కాబట్టి వారానికి ఒకసారి లేక రెండుసార్లు క్లీన్ చేసుకుని మూతలు పెట్టాలని, అనవసరమైన వస్తువులు బయట పారవేయాలని, పరిసరాల పరిశుభ్రతలో విద్యార్థులు కీలక భాగస్వామి కావాలని సూచించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత లోపం వల్ల గజ్జి, తామర, నులుపు వ్యాధి, ఏలిక పాములు, కామెర్లు, టైఫాయిడ్ మొదలగు వ్యాధులకు గురియ్యే అవకాశం ఉంది కాబట్టి ప్రతి విద్యార్థి భోజనానికి ముందు హ్యాండ్ వాష్ చేసుకోవాలన్నారు. తద్వారా తమ ఆరోగ్యం కాపాడుకోవచ్చుని సూచించారు. విద్యార్థులకు చేతులు ఏ విధంగా పరిశుభ్ర పరుచుకోవాలో గోవిందరావు చేసి చూపించారు. ఈ కార్యక్రమం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనంత్ పాల్ ఆధ్వర్యంలో హెల్త్ సూపర్వైజర్స్ గొరిపర్తి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త కె.వరలక్ష్మి, ఆశా కార్యకర్తలు, జ్యోతి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రైడే డ్రై డేలో అసిస్టెంట్ మలేరియా అధికారి

నీరు వృథా కాకుండా చూసుకోవాలి

జాతీయ జల జీవన్ మిషన్ ఎక్స్‌పర్ట్ టీమ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

చేతి పంపుల ద్వారా నీటిని వృథాగా పోనివ్వకుండా చూసుకోవాలని జాతీయ జల జీవన్ మిషన్ ఎక్స్‌పర్ట్ టీమ్ సభ్యులు ఎమ్‌సి.బాలమురి, ప్రకాష్ చంద్ర సమర్‌లు అన్నారు. వారు గురువారం మండలంలోని రాచన్నగూడెం పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీలోని వాటర్ ట్యాంక్, చేతి పంపులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నది ఎండాకాలం కాబట్టి చేతి పంపుల ద్వారా నీటిని వృథాగా పోకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. భూగర్భజలాలను కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా శానిటేషన్‌పై దృష్టి పెట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఇఇ సురేష్, డిఎల్‌పిఒ మహ్మద్ రజాఉల్ల, ఇఒపిఆర్‌డి నిఖిల్ మధుశరణ్, ఆర్‌డబ్ల్యు ఎస్ఎఇ వినయ్ కుమార్, సర్పంచి సున్నం వరలక్ష్మి, ఎపిఒ జాన్ వెస్లీ, పంచాయతీ కార్యదర్శి పద్మజ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు ఏలూరు డిఒ మేనేజర్ బి.వాణి ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్ ఉన్న ప్రతి ఒక్కరికి వారి ఇంటి వద్ద నుంచి ఎగ్జామినేషన్ హాల్ సెంటర్ వరకు, తిరిగి వారి ఇంటి వద్దకి ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయడమైందన్నారు. ఈ సౌకర్యం పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో కలదని, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : ఈనెల 18వ తేదీ నుంచి 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నందున పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షకేంద్రాలకు వెళ్లేందుకు, అనంతరం తిరిగి ఇంటికి చేరేందుకు ఆర్‌టిసి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని డిపో మేనేజర్ తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ చూపించి, అన్ని పల్లెవెలుగు సర్వీసు బస్సుల్లో పరీక్షలకు ఉచితంగా వెళ్లి రావడానికి అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్ తెలియజేశారు.

'ధర్మరాజుకు మద్దతుగా ఉంటాం'

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గం నుంచి బిజెపి, టిడిపి, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పి.ధర్మరాజుకు టిడిపి సంపూర్ణ మద్దతు తెలియజేసింది. భీమడోలులోని టిడిపి కార్యాలయంలో గురువారం ఉదయం టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గం అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన ఉంగుటూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న గన్ని వీరాంజనేయులు పొత్తులపై కార్యకర్తలతో మాట్లాడారు. వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వారందరూ తెలిపిన నిర్ణయం మేరకు ఉమ్మడి అభ్యర్థి ధర్మరాజుకు తమ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే ధర్మరాజు తనను కలిశారని, మద్దతు కోరారని చెప్పారు. పొత్తులో భాగంగా ఉంగుటూరు సీటును జనసేనకి చెందిన ధర్మరాజుకు కేటాయించారని, పొత్తు ధర్మంగా టిడిపి కార్యకర్తలు అందరూ ఆయనకు అండగా ఉంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపికి చెందిన ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గన్ని

రైతులకు రుణమాఫీ చేయాలి

ప్రజాశక్తి - పోలవరం

రైతులకు రుణమాఫీ చేసి మద్దతు ధర కల్పించాలని ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు తెలిపారు. ఈనెల 14న చలో ఢిల్లీతోపాటు జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలకు సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఎపి రైతు, కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించారు. 60 సంవత్సరాలు దాటిన పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు నెలకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి రోజు కూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చర్మ సమస్యలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

శరీరంలో అతిపెద్ద అవయవమైన చర్మం సమస్యలపై విద్యార్థులు అవగాహన కలిగి, చర్మ వ్యాధులను నిర్లక్ష్యం చేయరాదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హేలాపురి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చర్మవ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ డి.సుబ్బారావు మాట్లాడుతూ వివిధ రకాల చర్మ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు, అధ్యాపకులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కెబి.రావు, అధ్యాపకులు కె.అజయ్ కుమార్, కళాశాల సిపిడిసి సభ్యులు ఎల్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పాము కాటుకు గురై బాలిక మృతి

కలిదిండి : పాముకాటుకు గురై బాలిక మృతి చెందిన సంఘటన మండలంలోని మూలలంక గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గద్దె పాపారావు, రత్నకుమారి దంపతుల ఏకైక కుమార్తె మహిత(9) ప్రభుత్వ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతోంది. ఇంటివద్ద బాలిక ఫోన్‌లో ఆడుతున్న సమయంలో విష సర్పం కాలి చిటికెన వేలుపై కాటువేసింది. కుటుంబ సభ్యులకు చెప్పడంతో స్థానిక పిహెచ్‌సికి తీసుకు వెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. 12 రోజుల క్రితం బాలిక తండ్రి పాపారావు అనారోగ్యంతో మృతి చెందడంతో బాలిక ఇంటివద్దే ఉంటోంది. తల్లి రత్న కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కరెంట్ స్తంభాన్ని ఢీకొని యువకుడు మృతి

జీలుగుమిల్లి: కరెంట్ స్తంభాన్ని గుద్ది అక్కడికక్కడే యువకుడు చనిపోయిన ఘటన బుధవారం అర్ధరాత్రి సమయంలో జీలుగుమిల్లి ఎంపిడిఒ కార్యాలయ సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జీలుగుమిల్లి గ్రామానికి చెందిన పి.భరత్(24) అర్ధరాత్రి సమయంలో వేగవరంలో ఉంటున్న తన భార్య వద్దకు వెళ్తు జీలుగుమిల్లి ఎంపిడిఒ కార్యాలయ సమీపంలోని జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి కరెంట్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అతని తలకి తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

నాటుసారా తయారీదారుడు అరెస్టు

టి.నరసాపురం: నాటుసార తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తెడ్లం గ్రామంలో నాటుసార తయారు చేస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో నాటుసార తయారీ కేంద్రంపై దాడి చేసి నాటుసార తయారు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, తయారీ సామాగ్రితో పాటు 20 లీటర్లు నాటుసార స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముసునూరు: మండలంలోని సింహాద్రిపురం గ్రామం సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యం వాహనాన్ని విజిలెన్స్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో అధికారులు గురువారం తెల్లవారుజామున సీజ్ చేశారు. నిందితునిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు విజిలెన్స్ సిఐ విల్సన్ తెలిపారు. నూజివీడు పిడిఎస్ డిప్యూటీ తహశీల్దార్ జి.వెంకటేశ్వరరావు, విజిలెన్స్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కారల్‌మార్క్స్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, మహోపాధ్యాయుడు కారల్‌మార్క్స్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కారల్‌మార్క్స్ 141వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ మండల కార్యదర్శి జీవరత్నం అధ్యక్షత వహించగా, పార్టీ సీనియర్ నాయకులు సత్తు కోటేశ్వరరావు, ఎర్రంశెట్టి నాగేంద్రం మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రపంచ మానవాళి విముక్తి కోసం కార్మిక, కర్షకుల రాజ్యాధికారం కోసం అహెూ రాత్రులు కష్టపడి జీవితాన్ని త్యాగం చేసి కమ్యూనిస్టు ప్రాణాలిక సిద్ధాంతం రాసిన మేధావి మార్క్స్ అని కొనియాడారు. ఆయన చనిపోయిన తర్వాత ఆయన దహన సంస్కరణ కార్యక్రమాలకి పదిమంది హాజరయ్యారని, కానీ ఇప్పుడు ప్రపంచం మొత్తం మార్క్స్ సిద్ధాంతాన్ని అధ్యయనం చేసి ఆయనే ప్రపంచ మేధావి అని కమ్యూనిస్టు సిద్ధాంతం తోనే దోపిడీతనం పోతుందని, సమానత్వం, పేద ప్రజలకు రాజ్యాధికారం వస్తుందని, యావత్ ప్రపంచం తెలియజేసిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు తామ ముత్యాలమ్మ, మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్ రావు, యాగంటి సీత, పట్టణ కమిటీ సభ్యులు వంగా గోపి, ఎస్.సాయికృష్ణ, కె.విజయలక్ష్మి, కె.సుబ్బారావు, ఎ.స్టాలిన్, కె.సునీల్ పాల్గొని నివాళులు అర్పించారు.


జంగారెడ్డిగూడెంలోని కార్యక్రమంలో మాట్లాడుతున్న రవి

ఏలూరు అర్బన్ : ప్రపంచంలో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అందించిన గొప్పతత్వవేత్త కారల్ మార్క్స్ అని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ కొనియాడారు. కమ్యూనిస్టు సిద్ధాంతకర్త, మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పార్టీ నాయకులు కిషోర్, శ్రీనివాస్‌లు మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో సమాజాన్ని అనేకమంది శాస్త్రవేత్తలు, మేధావులు పరిపరి విధాలుగా విశ్లేషించారు కానీ, ప్రపంచం మొత్తం వర్గ పోరాటాలమయం అని మార్క్స్ విశ్లేషించారని అన్నారు. మార్క్స్ బాటలో కృషి చేస్తున్న కమ్యూనిస్టు ఉద్యమాలకు ప్రజలు పెద్దఎత్తున మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, జి.శారద పాల్గొన్నారు.

'ఏసీలు పెట్టిస్తే.. యాప్రన్, స్టెత్‌స్కోప్ పెట్టుకుని పనిచేస్తాం'

ప్రజాశక్తి - చింతలపూడి

ఏసీలు పెట్టండి, యాప్రన్ వేసుకుంటాం, మెడలో స్టెతస్కోప్ వేసుకొని పనిచేస్తాం అని నేరుగా రోగుల దగ్గరే అంటున్న చింతలపూడి ప్రభుత్వ హాస్పటల్ వైద్యాధికారి వ్యవహార శైలి నెలకొంది. మెడలో స్టెతస్కోప్, యాప్రన్ వేసుకుంటే పేషెంట్లు గుర్తుపడతారని అడుగగా ఈవిధంగా సమాధానం ఇస్తున్నారు. ఉదయం 9 గంటలకు రావాల్సిన వైద్యులు, ఉదయం 11 గంటలకు హాస్పిటల్‌కి వస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. చింతలపూడి కమ్యూనిటీ ప్రభుత్వ హాస్పటల్‌లో ముగ్గురు మాత్రమే డ్యూటీలో పనిచేస్తున్నారు. (ఫిజియోథెరపీ మినహా) కొతమంది గురువారం ఉదయం సెలవు పెట్టారని, మిగతావారు డ్యూటీలో ఉన్న, హాస్పటల్‌లో ఎక్కడా కనిపించడం లేదని రోగులు చెబుతున్నారు. రోగుల వార్డులో సిరంజిలు, బ్లేడ్స్ దర్శనం చేస్తున్నాయి. వార్డులలో ఎక్కడా కూడా శుభ్రత కనిపించిన పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలు వార్డులో కింద ఆడుకుంటున్నారని, వారికి సిరంజన్, బ్లేడ్ గుచ్చుకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. హాస్పటల్‌కి ఉదయం తొమ్మిది గంటలకు రావాల్సి ఉండగా, వారికి సమయం దొరికినప్పుడు, ఆస్పత్రికి వస్తున్నారని, రోగులు చెబుతున్నారు. దీనిపై హాస్పటల్ సూపరిటెండెంట్ కొన్నిసార్లు హెచ్చరించినా, జిల్లా డిసిహెచ్ పేరు చెప్పి కొంతమంది వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గురువారం హాస్పిటల్‌లో 11 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, ముగ్గురు మాత్రమే డ్యూటీలో ఉండటం అందుకు నిదర్శనంగా మారింది. ఇటు వార్డుల్లో నిర్లక్ష్యం కనిపిస్తుంది. ఇదేమిటని ప్రశ్నిస్తే ఇష్టమొచ్చినట్లు సమాధానం ఇస్తున్నారు. ఇప్పుడైనా ఉన్నతాధికారులు చింతలపూడి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏం జరుగుతుందో గమనించాల్సిందిగా రోగులు, స్థానికులు కోరుతున్నారు.


ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న వైద్యాధికారి రూము

ఉన్నతాధికారుల దృష్టిలో పెడతాను

హఫీజ్ ఖాన్, చింతలపూడి
ప్రభుత్వ హస్పటల్ సూపరిటెండెంట్

ఈ విషయమే జిల్లా ఉన్నతాధికారుల దృష్టిలో పెడతాను. వార్డులు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుతున్నారు. ఇకపై ఇలాంటి విషయాలు జరగకుండా జాగ్రత్తగా తీసుకుంటాను.

డిగ్రీ కళాశాలలో 'పై' డే

ప్రజాశక్తి - చింతలపూడి

1921లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి ఐన్‌స్టీన్‌కి లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఘనంగా అంతర్జాతీయ పై డే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో గణితశాస్త్ర ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పై చరిత్రను తెలియజేశారు. వృత్తం చుట్టుకొలత, దాని వ్యాసం, నిష్పత్తిని తెలియజేస్తుంది, పై విలువను 3.1415926గా సూచించారు. విద్యార్థులు ఈ పై డేను గణిత శాస్త్రంలో, సైన్స్ వారు ఎక్కడ ఎలా ఉపయోగిస్తారు అనే విషయాలని సవివరంగా తెలియజేశారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎన్‌జెకె.నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ పై డేను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరంం ఐక్యూఎస్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ మీర్ అసిన్ విద్యా, వినోదం గురించి తెలిపారు. అనంతరం డాక్టర్ ఎ.సంతోష్ చరిత్ర అధ్యాపకులు గణితంలో ఉపయోగించు పై విలువను సవివరంగా తెలియజేశారు. అనంతరం గణిత శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ డి.దేవానందం మాట్లాడుతూ గణిత శాస్త్రంలో ఉపయోగించు పై విలువను మొదటిసారిగా బ్రిటిష్ మ్యాథమెటీషియన్ విలియం జోన్స్ 1706లో పై ను గ్రీక్ అక్షరంగా తీసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపిని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు : బడేటి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసిపిని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి పేర్కొన్నారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా గురువారం ఏలూరు 24వ డివిజన్ శనివారపు పేట బెలియమ్ చర్చి వద్ద నుంచి నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని అర్థం చేసుకుని రానున్న ఎన్నికల్లో కూటమికి విజయాన్ని చేకూర్చి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి గూడవల్లి వాసు, డివిజన్ ఇన్‌ఛార్జి కడియాల విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు, భీమవరపు సురేష్, చోడే బాలు పాల్గొన్నారు.

రోడ్ మధ్యలో నిలిచిన గ్రీన్ ఫీల్డ్ హైవే వాహనం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కన్నయ్యగూడెం గ్రామంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం దగ్గరలో గ్రీన్‌ఫీల్డ్ హైవే వారి వాహనం ముందు చక్రం రిపేర్ రావడంతో రహదారి మధ్యలో వదిలేశారు. మంగళవారం నుంచి అలాగే వదిలేయడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధిక స్పీడ్‌తో గ్రీన్ ఫీల్డ్ వారి మట్టి లారీలు రావడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని, రాత్రి సమయాల్లో వాహనదారులు జీప్‌ను గుద్దే ప్రమాదం ఉందని, వెంటనే వాహనాన్ని రోడ్ మధ్యగా తియ్యాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'సిపిటి' నిర్వాహణపై హర్షం

ఏలూరు అర్బన్: గ్రేడ్-2 విఆర్‌ఒల ప్రొబిషన్‌కి సంబంధించి సర్వే ఎగ్జామ్స్, సిపిటి పాస్ కాని వారికి సర్వే ఎగ్జామ్, సిపిటి పాస్ కావడానికి ఒక సంవత్సరం సమయం ఇస్తూ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్ణయం తీసుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈమేరకు ఒకటి, రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

తడి, పొడి చెత్త సేకరణకు ప్లాస్టిక్ తొట్టెల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

పొలసానిపల్లి గ్రామపంచాయతీని ఆరోగ్యకరమైన పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని గ్రామ సర్పంచి షేక్ రహిమాబేగం హసేన కోరారు. గ్రామ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త విడివిడిగా సేకరణకు ప్లాస్టిక్ తొట్టెల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన సర్పంచి చెత్తను విచ్చలవిడిగా పారవేయడం వల్ల కలిగే ఇబ్బందులు ముఖ్యంగా ఆరోగ్యపరంగా తలెత్తే సమస్యలు గురించి గ్రామస్తులకు తెలియజేశారు. వారికి అవగాహన కల్పించారు. గ్రామస్తులు తమ ఇంటికి చెందిన తడి, పొడి చెత్తలను వేరువేరుగా కేటాయించిన ప్లాస్టిక్ తొట్టెల్లో వేసి వాటి సేకరణకు తమ వద్దకు వచ్చే పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కోరారు. దీనిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి చేరవేసి, వాటిని విభాగాల వారీగా విడదీసి ఆ పై దానిని గ్రామపంచాయతీకి అదనపు ఆదాయం చేకూర్చే ఆర్థిక వనరుగా మార్చుతామని తెలిపారు. దీనివల్ల గ్రామ పరిధిలో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచి అంబటి నాగేంద్ర ప్రసాద్, వైసిపి నాయకులు విల్సన్, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధన కోసం కృషి చేయాలి

మండవల్లి: విద్యార్థులు తమ లక్ష్యానికి ప్రతిభను జత చేసి లక్ష్య సాధన కోసం నిరంతరం పట్టుదలతో కృషి చేయాలని ప్రొఫెసర్ సుధాబద్ర విజయకుమార్ తెలిపారు. మండలంలోని ఇంగిలంపాక లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి తర్వాత తీసుకునే సబ్జెక్టుల కోర్సుల ఎంపికే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. ప్రతిభను గుర్తించి తగు ఆధారంగా విద్యార్థులు నిర్ణయం తీసుకోవాలన్నారు. 10వ తరగతి తర్వాత కోర్సులు, ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. ఎల్ఎస్.భాస్కరరావు మాట్లాడుతూ జీవితంలో పైకి ఎదగాలంటే ప్రతి విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. చదువుతోపాటు ప్రజాస్వామ్యం పట్ల ఎన్నికలపై కనీసం తెలియాల్సిన అవసరం ఉందన్నారు. పట్టుదలతో చదివి తల్లిదండ్రుల లక్ష్యం నెరవేర్చాలని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

ఏలూరు: జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మా అధ్యక్షులు పవన్ కళ్యాణ్ తరపున జనసైనికులు, వీర మహిళలు, జనసేన నాయకులు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం అని ఏలూరు జనసేన ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. ఏలూరు నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళల సమక్షంలో జనసేన పతాక ఆవిష్కరణ చేసి వేడుకగా ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త బివి.రాఘవయ్య చౌదరి హాజరయ్యారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ 2014లో రాష్ట్రంలో కానీ, దేశంలో కానీ రాజకీయంలో పెను మార్పు రావాలనే ఆలోచనతో జనసేనని పవన్ కళ్యాణ్ స్థాపించారన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు, సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరం పార్టీ కోసం కష్టపడతామని ఆయన తెలియజేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, ప్రధాన కార్యదర్శి సరిది రాజేష్, ఫ్యాన్స్ ప్రెసిడెంట్ దోసపర్తి రాజు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని మక్కినవారిగూడెం జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పోలవరం నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టి.నరసాపురం మండల జనసేన అధ్యక్షులు అడపా నాగరాజు, సాయిల వెంకటేశ్వరరావు, రాఘవరాజు సురేష్, మల్లవరపు ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మండలంలోని పాత రావిచెర్ల గ్రామంలో జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో జనసేన, టిడిపి ఆధ్వర్యంలో తప్పనిసరిగా విజయదుందుబి మోగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఫణి బాబు, జనసేన కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి, శివరామకృష్ణ పార్టీ జెండా ఆవిష్కరించారు.

కామవరపుకోట: జనసేన ఆవిర్భావ వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు షేక్ వలి జనసేన జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేక ఈశ్వరయ్య, మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళీ పాల్గొన్నారు.

కుక్కునూరు : మండల కేంద్రంలో స్థానిక జనసేన ఆధ్వర్యంలో జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని టిడిపి, బిజెపి నాయకులతో కలిసి జనసేన నాయకులు నిర్వహించారు. పార్టీ మండల నాయకుడు ములిశెట్టి యుగంధర్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మోదుంపురపు వెంకన్న బాబు, లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

పంటల వివరాలు ఆర్‌బికెలో తీసుకోవాలి

పోలవరం: మండలంలోని రబీ 2023 సీజన్‌కు సంబంధించి 1,395 మంది రైతులకు 2,894 ఎకరాలు వరి, 2,232 మంది రైతులకు 4,826 ఎకరాలు మొక్కజొన్న, మిగతా పంటలకు సంబంధించి మొత్తం 3,687 మంది రైతులకు 7,876 ఎకరాలకు ఇ-క్రాప్ నమోదు చేయడం జరిగిందని బుధవారం పోలవరం మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు తెలిపారు. రైతులందరికీ సంబంధించిన రైతు భరోసా కేంద్రాల్లో ఈ రెండు రోజుల్లో చేస్తున్న పంటల వారి వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులు సర్టిపై చేసి రసీదు పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున రైతులందరూ కాపీని తీసుకోవాలని ఆయన కోరారు.

'పవన్ కళ్యాణ్ మాటకు కట్టుబడి ఉంటాం'

ఏలూరు టౌన్: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాటే మాకు శాసనమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. ఏలూరులో జరిగిన కాపు సంక్షేమ సంఘ ప్రారంభ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తమకు ఎంఎల్‌ఎ, ఎంపీ పదవులు వద్దన్నారు. పవన్ కళ్యాణ్‌కు ఎటువంటి సలహాలు, సూచనలు ఇవ్వమని, లేఖలు కూడా రాయమని అన్నారు. ఆయన ఏ నిర్ణయాలు తీసుకున్నా ప్రశ్నించమన్నారు. పవన్ ఆదేశాల ప్రకారం సమాజంలో అన్ని కులాలను కలుపుకుని పెద్దన్న పాత్ర పోషిస్తామన్నారు. ఇటీవల కొందరు కాపు నేతలు తప్పుదారి పట్టారని, వారికి కాపు సామాజిక వర్గ మద్దత్తు లేదన్నారు. తమ కాపు సంక్షేమ సంఘానికి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు 80 శాతం సామాజిక మద్దత్తు ఉందన్నారు. కెవిఎస్ గ్రూపుల్లో రాష్ట్రంలో 6 లక్షల మంది సభ్యులున్నారని, ప్రతి సభ్యుడూ పవన్ కళ్యాణ్ కూటమికి కనీసం 10 ఓట్లు వేయించాలని పులి శ్రీరాములు పిలుపునిచ్చారు. ముందుగా కాపులకు కావాల్సిన ఐక్యత, ఐకమత్యం సాధించటానికి కృషి చేస్తానన్నారు. కాపులు ఆవేశం తగ్గించుకుని అందరితో సక్యతగా ఉంటూ అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కోటి 42 లక్షల మంది జనాభా ఉన్న కాపులకు ఇంతవరకూ రాజ్యాధికారం రాకపోవటం ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో కచ్చితత్వంతో పనిచేయాలి

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించే వివిధ స్థాయి అధికారులు, పోలింగు అధికారులు, సిబ్బంది ఖచ్చితత్వంతో పనిచేసి జిల్లాకు ఆదర్శనీయంగా నిలవాలని ఉంగుటూరు అసెంబ్లీ రిటర్నింగు అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఖాజావలి అన్నారు. ఎన్నికల విధులు, బాధ్యతలపై నోడల్ అధికారులకు గురువారం నారాయణపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శిక్షణా, అవగాహన సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిపై వివరించారు. ఉంగుటూరు తహశీల్దారు కట్టా శివయ్య పాల్గొన్నారు.

12 మంది విద్యార్థులు గైర్హాజరు

కలిదిండి : ఇంటర్ ప్రథమ సంవత్సర కామర్స్, కెమిస్ట్రీ పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరెండెంట్ నంబూరి గోపాల కృష్ణంరాజు తెలిపారు. మండలంలోని కోరుకొల్లు, కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 99 మంది హాజరు కావల్సి ఉండగా 87 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

పిఎసిఎస్ భవనం ప్రారంభం

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలో నూతనంగా నిర్మించిన పిఎసిఎస్ భవనాన్ని గురువారం ఎంఎల్‌ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వ సేవలను వారి గడప వద్దకే రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లిందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెడి సిసిబి ఛైర్మన్ పద్మావతి, పిఎసిఎస్ అధ్యక్షులు సాయిబాబా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ పంచాయతీల్లో రక్షిత మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జల జీవన్ మిషన్ నేషనల్ వాష్ ఎక్స్‌ఫర్ట్‌లు బాలమురి, ప్రకాష్ చంద్ర సమర్‌లు సూచించారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో గురువారం జల జీవన్ మిషన్ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయిలో అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ ఎమ్‌డీ రజావుల్లా, డిఇఇ సురేష్, మండల తాగునీటి అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ పాల్గొన్నారు.

'పది' హాల్ టికెట్లు వెబ్‌సైట్లో..

ఏలూరు సిటీ: 10వ తరగతి విద్యార్థుల హాల్ టికెట్లను bse.ap.gov.in వెబ్ సైట్‌లో పొందుపరచడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి గురువారం తెలియజేశారు. అయితే ప్రయివేటు పరీక్షా కేంద్రం 51006 - శ్రీ చైతన్య పాఠశాల, గవరవరం, ఏలూరు, రెగ్యులర్ పరీక్ష కేంద్రం 51017-నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఆర్ఆర్ పేట, ఏలూరు కేటాయించబడిన విద్యార్థుల హాల్ టికెట్లలో సాంకేతిక లోపం కారణంగా పూర్తి చిరునామా ముద్రణ కాలేదన్నారు. వెంటనే స్పందించిన అధికారులు సాంకేతిక లోపాన్ని సవరించి హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కావున పైన తెలపబడిన పరీక్షా కేంద్రాలలో కేటాయించబడిన విద్యార్థులు వారు చదివే పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.అబ్రహం ఒక పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.